PRGI TGTEL/26/A6901

నవ దృక్పథం

తెలుగు వార్త వార పత్రిక

TRUTH FACTS INTEGRITY

Publisher : SYED MOHD SALAUDDIN

www.navadrukpatham.com

సంపుటి : 01 సంచిక : 08 హైదరాబాద్ 19 అక్టోబర్ 2026 సోమవారం ఎడిటర్: సయ్యద్ మహమ్మద్ సలావుద్దీన్ అలీ వేలా : రూ/ 2/-పేజీలు: 12

Published From: Hyderabad Malkajgiri Ranga Reddy Sanga Reddy Yadagiri Mahabub Nagar Medak Karim Nagar Kama Reddy Nizamabad Vikarabad Zahirabad Warangal Tandur Nalgonda



డ్రగ్స్ మహమ్మారిపై యుద్ధం.. 2029 డిసెంబర్ 31 నాటికి భారత్‌ను మాదకద్రవ్య రహిత దేశంగా మారుస్తాం!:అమిత్ షా



న్యూఢిల్లీ,: ప్రత్యేక ప్రతినిధి) దేశ భవిష్యత్తును లోలోపల కుళ్లగొడుతూ, యువత జీవితాలను అంధకారంలోకి నెట్టేస్తున్న మాదకద్రవ్యాల మహమ్మారిపై కేంద్ర ప్రభుత్వం యుద్ధం ప్రకటించింది. డ్రగ్స్ అనే విషవలయం నుంచి దేశాన్ని బయటపడేయడమే లక్ష్యంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా కీలక ప్రకటన చేశారు. 2029 డిసెంబర్ 31 నాటికి భారత్‌ను డ్రగ్స్ రహిత దేశంగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టడం ఒక్క పోలీసు శాఖ బాధ్యత మాత్రమే కాదని, కేంద్రం, రాష్ట్రాలు, భద్రతా సంస్థలు, ప్రజలు సమష్టిగా కదిలినప్పుడే ఈ మహమ్మారిని కట్టడి చేయగలమని పిలుపునిచ్చారు. దేశ రాజధాని దిల్లీలో బుధవారం నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో అమిత్ షా మాట్లాడారు. మాదకద్రవ్యాల సమస్యను సాధారణ నేరంగా చూడలేమని, ఇది భావితరాల భవిష్యత్తును దెబ్బతీసే తీవ్రమైన ముప్పు అని హెచ్చరించారు. డ్రగ్స్ వ్యసనం వ్యక్తుల జీవితాలను నాశనం చేయడమే కాకుండా కుటుంబాలను ఆర్థికంగా, సామాజికంగా కుంగదీస్తోందని పేర్కొన్నారు. మరోవైపు, మాదకద్రవ్యాల అక్రమ వ్యాపారం ద్వారా దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే శక్తులకు నిధులు అందుతున్నాయని వెల్లడించారు. అందుకే డ్రగ్స్‌పై పోరాటం ప్రజాఆరోగ్య పరిరక్షణతో పాటు జాతీయ భద్రతకు సంబంధించిన కీలక అంశమని స్పష్టం చేశారు. యువతను కాపాడటం దేశాన్ని కాపాడటంతో సమానం! డ్రగ్స్ మాఫియా ఉచ్చులో చిక్కుకుంటున్న యువతను రక్షించడం సమాజం ముందున్న అతిపెద్ద సవాళ్లలో ఒకటి. మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తి ఆరోగ్యానికే పరిమితం కాకుండా కుటుంబ వ్యవస్థను, విద్యా భవిష్యత్తును, ఉపాధి అవకాశాలను, దేశ ఉత్పాదక శక్తిని దెబ్బతీస్తుంది. ఈ పరిణామాలు దీర్ఘకాలంలో దేశ ఆర్థిక వ్యవస్థపై కూడా భారాన్ని మోపుతాయి. ఈ ప్రమాదాన్ని దృష్టిలో పెట్టుకొని రానున్న కాలంలో డ్రగ్స్ అక్రమ రవాణా, సరఫరా వ్యవస్థలు, వాటి వెనుక ఉన్న నెట్‌వర్క్‌లపై సమన్వయంతో చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని అమిత్ షా నొక్కిచెప్పారు. కేవలం మాదకద్రవ్యాలు స్వాధీనం చేసుకోవడం లేదా కొంతమంది నిందితులను అరెస్టు చేయడంతో సమస్య మొత్తాన పరిష్కారం కాదని, అక్రమ వ్యాపారానికి ఆర్థిక సహాయం అందించే వ్యవస్థలను కూడా దెబ్బతీయాలని ఉంటుందని అయన వ్యాఖ్యా సారాంశం స్పష్టం చేస్తోంది. మూడున్నరేళ్ల ఉమ్మడి పోరాటం.. లక్ష్యం ఒక్కటే! 2026లో మిగిలిన కాలంతో పాటు 2027, 2028, 2029 సంవత్సరాల్లో సమన్వయంతో డ్రగ్స్ వ్యతిరేక పోరాటాన్ని కొనసాగించి, 2029 డిసెంబర్ 31 నాటికి దేశాన్ని మాదకద్రవ్యాల సమస్య నుంచి విముక్తి చేయాలన్నది కేంద్ర హోం మంత్రిత్వ శాఖ లక్ష్యమని అమిత్ షా ప్రకటించారు. ఈ లక్ష్యాన్ని చేరుకోవాలంటే మాదకద్రవ్యాల అక్రమ రవాణా మార్గాలను గుర్తించడం, సరఫరా వ్యవస్థలను అడ్డుకోవడం, సంబంధిత నెట్‌వర్క్‌లపై నిఘా పెంచడం, యువతలో అవగాహన కల్పించడం వంటి చర్యలు కీలకం కానున్నాయి. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలల పరిసరాల్లో మాదకద్రవ్యాల ముప్పును నిర్లక్ష్యం చేయకుండా, తల్లిదండ్రులు, విద్యాసంస్థలు, స్థానిక సంస్థలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ లక్ష్యం ప్రకటనతోనే ఆగిపోకుండా క్షేత్రస్థాయిలో ఫలితాలు కనిపించినప్పుడే డ్రగ్స్ రహిత భారత్ కల సాకారమవుతుంది. అక్రమ రవాణాదారులపై కఠిన చర్యలతో పాటు మాదకద్రవ్యాల బారినపడిన వారికి చికిత్స, పునరావాసం,

పోలీస్ శాఖలో 7,437 పోస్టుల భర్తీకి ఇప్పటికే అనుమతి.. మరో 5 వేల ఉద్యోగాల భర్తీకి చర్యలు: సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్,: ప్రత్యేక ప్రతినిధి)రాష్ట్రంలో శాంతిభద్రతలను మరింత పటిష్టం చేయడం, పోలీస్ శాఖలో సిబ్బంది కొరతను అధిగమించడం, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరుల కుటుంబాలకు అండగా నిలవడం లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయాల దిశగా అడుగులు వేస్తోంది. పోలీస్ శాఖలో మొత్తం 7,437 పోస్టుల భర్తీకి అనుమతి ఇచ్చామని, మరో ఐదు వేల ఉద్యోగాల భర్తీకి చర్యలు చేపట్టామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. 2028 నాటికి పోలీస్ శాఖలోని అన్ని ఖాళీలను భర్తీ చేయడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని గోషామహల్ స్టేడియంలో బుధవారం నిర్వహించిన పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొని అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. డీజీపీ సీవీ ఆనంద్‌తో పాటు పలువురు పోలీసు ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలను త్యాగం చేసిన పోలీసుల సేవలను స్మరించుకుంటూ రూపొందించిన 'అమరుల వారు' పుస్తకాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. పోలీసుల త్యాగాలకు వెలకట్టలేం.. కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది! ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పిస్తూ, సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు సిబ్బంది కుటుంబాలపై ఏర్పడిన లోటును ఎవరూ భర్తీ చేయలేరని, అయితే ఆ కుటుంబాలు ఒంటరివి కావని భరోసా ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం, పోలీస్ శాఖ, సమాజం వారి వెన్నంటే ఉంటాయని స్పష్టం చేశారు. శాంతిభద్రతలు సక్రమంగా ఉంటేనే రాష్ట్రంలో అభివృద్ధి వేగంగా సాగుతుందని సీఎం పేర్కొన్నారు. పెట్టుబడులు, పారిశ్రామిక ప్రగతి, ప్రజల జీవన భద్రతకు పోలీస్ వ్యవస్థ కీలకమని, అందువల్లే పోలీస్ శాఖను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. 7,437 పోస్టులకు అనుమతి.. మరో ఐదు వేల నియామకాలకు కసరత్తు! పోలీస్ శాఖలో సిబ్బంది కొరతను తగ్గించి, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు నియామక ప్రక్రియను వేగవంతం చేస్తున్నట్లు సీఎం వెల్లడించారు. ఇప్పటికే 4,773 కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చామని, మొత్తం 7,437 పోస్టుల భర్తీకి అనుమతి మంజూరు చేశామని వివరించారు. మిగిలిన ఖాళీలను సైతం దశలవారీగా భర్తీ చేస్తామని తెలిపారు. 2028 నాటికి పోలీస్ శాఖలో అన్ని ఖాళీలను భర్తీ చేయాలన్న లక్ష్యాన్ని ప్రకటించడం నిరుద్యోగ యువతలో ఆశలు రేకెత్తించే అంశంగా మారింది. అయితే ప్రకటించిన పోస్టులన్నింటికీ నియామక ప్రక్రియ ఎప్పుడు పూర్తవుతుంది? నోటిఫికేషన్లు, పరీక్షలు, ఎంపికలు, నియామక ఉత్తర్వులకు సంబంధించిన కాలపట్టిక ఎలా ఉంటుంది? అన్నది నిరుద్యోగుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. గతంలో ఎన్నడూలేని విధంగా 112మంది డీఎస్పీలను నియమించినట్లు సీఎం వెల్లడించారు. పోలీస్ వ్యవస్థలో క్షేత్రస్థాయి నుంచి ఉన్నతాధికారుల స్థాయి వరకు సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అమరుల కుటుంబాలకు కోటి నుంచి రూ.2 కోట్ల వరకు పరిహారం! విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల కుటుంబాలకు అందించే పరిహారాన్ని భారీగా పెంచినట్లు సీఎం ప్రకటించారు. హోదాను బట్టి ఎక్స్‌గ్రేషియా అందించేలా నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు.★ కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్ఐలు: రూ.1 కోటి★ ఎస్ఐలు, ఇన్స్‌పెక్టర్లు: రూ.1.25 కోట్లు★ డీఎస్పీ, అదనపు ఎస్పీ స్థాయి అధికారులు: రూ.1.50 కోట్లు★ ఎస్పీ, ఐపీఎస్ అధికారులు: రూ.2 కోట్లు ఈ పరిహారం కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదని, దేశం కోసం, ప్రజల రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసుల కుటుంబాల పట్ల ప్రభుత్వం చూపుతున్న గౌరవానికి ప్రతీక అని సీఎం పేర్కొన్నారు. పోలీసుల త్యాగాలకు తగిన గుర్తింపు ఇవ్వడం, వారి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. అమరుల కుటుంబాల సంక్షేమం, పోలీసు సిబ్బంది భద్రత, ఉద్యోగుల సంక్షేమ కార్యక్రమాల అమలుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. హోంగార్డుల కుటుంబాలకూ ఊరట.. పరిహారం రూ.10 లక్షలకు పెంపు! పోలీసు వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న హోంగార్డుల కుటుంబాలకు అందించే ఎక్స్‌గ్రేషియాను కూడా పెంచే దిశగా సీఎం కీలక ప్రకటన చేశారు. ప్రస్తుతం అందిస్తున్న రూ.5 లక్షల పరిహారాన్ని రూ.10 లక్షలకు పెంచాలని డీజీపీని ఆదేశిస్తున్నట్లు తెలిపారు. ఈ నిర్ణయం అమలులోకి వస్తే విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన హోంగార్డుల కుటుంబాలకు కొంతమేర ఆర్థిక భరోసా లభించనుంది. పోలీస్ శాఖలోని వివిధ స్థాయిల సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా వారి సేవలకు తగిన గుర్తింపు కల్పించాల్సిన ప్రభుత్వ ఉద్దేశం ఈ ప్రకటనలో స్పష్టమవుతోంది. మహిళా భద్రతపై ప్రత్యేక నిఘా.. షీ టీమ్స్ సేవలు కొనసాగింపు! మహిళలు, చిన్నారుల భద్రత విషయంలో రాజీ పడబోమని సీఎం స్పష్టం చేశారు. మహిళలపై నేరాలను అరికట్టేందుకు షీ టీమ్స్ సేవలను కొనసాగిస్తూ మరిన్ని చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. మహిళలు, చిన్నారులకు సంబంధించిన కేసుల్లో పోలీసులు మరింత సున్నితంగా వ్యవహరించాలని, బాధితులకు న్యాయం అందించడంలో జాప్యం జరగకూడదని సూచించారు. మహిళల భద్రత కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు. బాధితులు పోలీసులను అశ్రయించినప్పుడు వారికి తక్షణ స్పందన, తగిన రక్షణ, చట్టపరమైన న్యాయం అందేలా వ్యవస్థ పనిచేయాల్సిన అవసరాన్ని సీఎం నొక్కిచెప్పారు. డ్రగ్స్, గంజాయిపై ఉక్కుపాదం.. ఈగల్ ఫోర్స్‌కు ప్రశంసలు! యువత మాదకద్రవ్యాలకు బానిస కాకుండా కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని సీఎం పేర్కొన్నారు. డ్రగ్స్ నియంత్రణలో తగుల్ ఫోర్స్ చేస్తున్న కృషిని, పోలీస్ శాఖ పనితీరును అభినందించారు. మాదకద్రవ్యాల సరఫరా, నియోగాన్ని అరికట్టడంతో పాటు యువతను వ్యసనాల నుంచి దూరంగా ఉంచేందుకు అవగాహన కార్యక్రమాలు కూడా అవసరమని స్పష్టం చేశారు. సైబర్ నేరాలు రోజురోజుకూ కొత్త రూపాలు సంతరించుకుంటున్న నేపథ్యంలో వాటిని అడ్డుకునేందుకు పోలీస్ శాఖ మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అన్‌లైన్ మోసాలు, ఆర్థిక నేరాలు, డిజిటల్ వేదికల ద్వారా జరిగే అక్రమాలపై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు నేరగాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ వైఖరిని వెల్లడించారు. కల్లీ ఆహారంపై చర్యలు.. టీజీ సేఫ్ వ్యవసాయ ప్రోత్సాహం! ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారుతున్న కల్లీ ఆహారాన్ని అరికట్టేందుకు టీజీ సేఫ్ వ్యవసాయ తీసుకొచ్చినట్లు సీఎం తెలిపారు. ఆహార పదార్థాల కల్లీ, ప్రజారోగ్యానికి హాని కలిగించే కార్యకలాపాలపై సంబంధిత విభాగాలు కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ప్రజల ప్రాణాలు, ఆరోగ్యం, ఆస్తులకు రక్షణ కల్పించడంలో పోలీస్ శాఖతో పాటు ఇతర ప్రభుత్వ విభాగాల సమన్వయం కీలకమని పేర్కొన్నారు. పోలీసు కుటుంబాల పిల్లలకు విద్యావకాశాలు పోలీసు సిబ్బంది సంక్షేమంలో భాగంగా హోంగార్డు నుంచి డీజీపీ స్థాయి వరకు ఉద్యోగుల పిల్లలకు నాణ్యమైన విద్యావకాశాలు కల్పించేందుకు యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను ప్రారంభించినట్లు సీఎం వివరించారు. విధి నిర్వహణలో నిరంతరం ఒత్తిడిని ఎదుర్కొనే పోలీసు కుటుంబాలకు విద్య, సంక్షేమం, ఆర్థిక భద్రత వంటి అంశాల్లో అండగా నిలవడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రకటనలే కాదు.. అమలులోనే పోలీస్ శాఖకు నిజమైన బలం! పోలీస్ శాఖలో వేలాది పోస్టుల భర్తీ, అమరవీరుల కుటుంబాలకు భారీ పరిహారం, హోంగార్డుల ఎక్స్‌గ్రేషియా పెంపు, మహిళల భద్రత, ట్రాఫ్ నియంత్రణ వంటి అంశాలపై సీఎం చేసిన ప్రకటనలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. అయితే ఈ నిర్ణయాల ఫలితాలు క్షేత్రస్థాయిలో కనిపించాలంటే నియామక ప్రక్రియను నిర్దేశిత గడువులో పూర్తి చేయడం, పోలీసు సిబ్బందికి అవసరమైన వనరులు కల్పించడం, ప్రజల ఫిర్యాదులపై వేగంగా స్పందించడం కీలకం. 2028 నాటికి అన్ని ఖాళీల భర్తీ లక్ష్యం ఎంతవరకు నెరవేరుతుంది? నిరుద్యోగులకు ఉద్యోగాలు ఎప్పుడు అందుతాయి? అమరవీరుల కుటుంబాలకు ప్రకటించిన పరిహారం, హోంగార్డుల ఎక్స్‌గ్రేషియా పెంపు నిర్ణయాలు ఎప్పటి నుంచి అమల్లోకి వస్తాయి? అన్న ప్రశ్నలకు రాబోయే రోజుల్లో ప్రభుత్వ చర్యలే సమాధానం చెప్పనున్నాయి. ప్రజల భద్రతే

నిరసనల పేరుతో బారికేడ్లు దాటితే కుదరదు.. శాంతిభద్రతలే కీలకం! హైకోర్టులో పిటిషన్ ఉపసంహరించుకున్న సౌరవ్ దాస్, ఆశుతోష్ రాంకా



న్యూఢిల్లీ,:ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ఉన్నంత మాత్రాన నిబంధనలను పక్కనపెట్టి ఎక్కడ పడితే అక్కడ ఆందోళనలు నిర్వహించవచ్చా? పోలీసుల అనుమతులు, శాంతిభద్రతల పరిరక్షణ, బారికేడ్ల ఏర్పాటు వెనుక ఉన్న ఉద్దేశాలను విస్మరించి ముందుకు సాగడం ఎంతవరకు సమంజసం? కాక్రోచ్ జనతా పార్టీ (CJP) నేత పిటిషన్ విచారణ సందర్భంగా దిల్లీ హైకోర్టు చేసిన వ్యాఖ్యలు ఈ ప్రశ్నలను మరోసారి చర్చకు తెచ్చాయి. ప్రత్యేక ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ (SEM) తమ జ్యుడీషియల్ కస్టడీని పొడిగిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ సౌరవ్ దాస్, ఆశుతోష్ రాంకా దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయస్థానం కీలక సూచనలు చేసింది. ముందుగా సంబంధిత మేజిస్ట్రేట్ వద్ద విచారణ ప్రక్రియ పూర్తయ్యే వరకు వేచి చూడాలని, అక్కడ న్యాయం జరగలేదని భావిస్తే తదుపరి అప్పీలేట్ కోర్టును ఆశ్రయించాలని స్పష్టం చేసింది. ప్రత్యామ్నాయ న్యాయ మార్గాలను అనుసరించకుండా నేరుగా హైకోర్టును ఎందుకు ఆశ్రయించారని ధర్మాసనం ప్రశ్నించింది. దీంతో హైకోర్టులో తక్షణ ఊరట లభించకపోవడంతో పిటిషనర్లు తమ పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు. అయితే, ఈ పరిణామాన్ని నిందితులపై అరోపణలు నిరూపితమైనట్లుగా భావించరాదు. కేసులోని అరోపణలు, వాటి చట్టబద్ధతపై తుది నిర్ణయం సంబంధిత న్యాయ ప్రక్రియలోనే తేలాల్సి ఉంటుంది. బారికేడ్ల దాటడంపై కోర్టు అభ్యంతరం జస్టిస్ సుభ్రమణియం ప్రసాద్ నేతృత్వంలోని ధర్మాసనం నిరసన నిర్వహణలో పోలీసుల అనుమతి ప్రాధాన్యాన్ని వివరించింది. జంతర్‌మంతర్‌ను నిరసన ప్రదేశంగా గుర్తించిన అనుమతులు రద్దయిన తర్వాత కూడా అక్కడికి వెళ్లాలన్న అవసరం ఏమిటని ప్రశ్నించింది. బారికేడ్లు ఏర్పాటు చేయడం వెనుకనిర్దిష్టమైన ఉద్దేశం ఉంటుందని,వాటిని దాటడం వల్ల ఇతరులు కూడా నియంత్రిత ప్రాంతంలోకి ప్రవేశించే అవకాశం ఏర్పడుతుందని పేర్కొంది. ఒక నిరసన నిర్దిష్ట లక్ష్యంతో ప్రారంభమైనప్పటికీ, దానితో సంబంధం లేని వ్యక్తులు ఆ ప్రదేశంలోకి ప్రవేశిస్తే పరిస్థితులు అదుపు తప్పే ప్రమాదం ఉందని ధర్మాసనం అభిప్రాయపడింది. అలాంటి పరిణామాలు అసలు నిరసనలో పాల్గొన్నవారిపైనా ప్రభావం చూపవచ్చని సూచించింది. నిరసనలకు అనుమతులు తీసుకోవడం అంటే ప్రజల గొంతును నొక్కివేయడమే కాదని, శాంతిభద్రతలను కాపాడటం, ఇతరుల చొరబడి గందరగోళం సృష్టించకుండా చూడటం కూడా అనుమతి విధానంలో ముఖ్యమైన ఉద్దేశాలని కోర్టు వివరించింది. ఫ్రాస్ అల్లర్ల ప్రస్తావన.. అందోళనలు హింసాత్మకంగా మారితే? విచారణలో ఫ్రాస్,లో విద్యార్థుల అందోళనలు హింసాత్మక ఘటనలకు దారితీసిన ఉదంతాలను ధర్మాసనం ప్రస్తావించింది. నిరసనలు ఒక ఉద్దేశంతో ప్రారంభమైనా, కాలక్రమంలో వాటి స్వరూపం మారి అగ్నిప్రమాదాలు, బోంబీలు వంటి ఘటనలకు దారితీసే ప్రమాదం ఉంటుందని పేర్కొంది. శాంతిభద్రతలకు ముప్పు ఏర్పడే అవకాశం ఉన్న సందర్భాల్లో నిరసన నిర్వాహకులు ఎవరు? వారి సంస్థ ఏది? ఆ సంస్థ లక్ష్యాలేమిటి? వంటి అంశాలు కూడా పరిశీలనకు రావచ్చని ధర్మాసనం అభిప్రాయపడింది. అయితే, నిరసనలపై నియంత్రణ విధించడం ఒక అంశమైతే, వాటిని నిర్వహించిన వ్యక్తుల చర్యలు చట్టవిరుద్ధమా కాదా అనేది మరో అంశం. బారికేడ్లు దాటి వెళ్లిన వ్యవహారంలో చట్టపరమైన అంశాలను పరిశీలించాల్సి ఉంటుందని కోర్టు పేర్కొన్నట్లు కథనంలో వెల్లడైంది. ఈ వ్యాఖ్యలతో నిరసన హక్కు, ప్రజా భద్రత, పోలీసుల విధులు, చట్టపరమైన పరిమితుల మధ్య ఉన్న సున్నితమైన సమతుల్యత మరోసారి ప్రాధాన్యం సంతరించుకుంది. జంతర్‌మంతర్ వద్ద ఏం జరిగింది? అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం, సౌరవ్ దాస్, ఆశుతోష్ రాంకాలను అక్టోబర్ 13న పోలీసులు అరెస్టు చేశారు. భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ జంతర్‌మంతర్ వద్ద నిరసన చేపట్టే క్రమంలో పోలీసుల బారికేడ్లను దాటి లోపలికి వెళ్లినట్లు వారిపై అరోపణలు ఉన్నాయి. జంతర్‌మంతర్ వద్ద నిరసనలకు సంబంధించిన అనుమతుల రద్దు నేపథ్యంలో అక్కడికి వెళ్లడంపై పోలీసులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అనంతరం తమ కస్టడీని పొడిగిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ ఇద్దరూ దిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. వారి కస్టడీ గడువు బుధవారంతో ముగియనున్న నేపథ్యంలో పిటిషన్‌ను అత్యవసరంగా విచారించేందుకు హైకోర్టు అంగీకరించింది. అయితే, మొదట సంబంధిత ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ వద్ద అందుబాటులో ఉన్న న్యాయ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించింది. దీంతో పిటిషనర్లు తమ పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు. 'మీరు జెన్-జెడ్ కాదు'.. విచారణలో ఆసక్తికర వ్యాఖ్య విచారణ సందర్భంగా సౌరవ్ దాస్ వయసు 26 ఏళ్లు, ఆశుతోష్ రాంకా వయసు 31 ఏళ్లు అని తెలుసుకున్న ధర్మాసనం, వారు జెన్-జెడ్ తరానికి చెందినవారు కాదని వ్యాఖ్యానించినట్లు సమాచారం. అనంతరం మిలీనియల్స్ ఏ వయసా వర్గానికి చెందుతారని సరదాగా ప్రశ్నించింది. నిరసనల్లో పాల్గొనే వ్యక్తులు మారకపోయినా, ఉద్యమానికి సంబంధించిన కారణాలు, పరిస్థితులు మారే అవకాశం ఉంటుందని కోర్టు అభిప్రాయపడింది.నిరసనలస్వరూపం,వాటి నిర్వహణ, శాంతిభద్రతలపై ప్రభావం వంటి అంశాలను విడివిడిగా పరిశీలించాల్సిన అవసరాన్ని ప్రస్తావించింది. నిరసన హక్కు ఒకవైపు.. చట్టబద్ధమైన విధానం మరోవైపు! ఈ కేసు ద్వారా మరోసారి ముందుకు వచ్చిన ప్రధాన అంశం ఇదే. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నించడం, ఎన్నికల వ్యవస్థపై అభిప్రాయాలు వ్యక్తం చేయడం, నిరసనలు చేపట్టడం పౌరుల హక్కుల్లో భాగం.

అదే సమయంలో ఆ హక్కును మినియోగించుకునే క్రమంలో చట్టబద్ధమైన విధానాలు, ప్రజా భద్రతకు సంబంధించిన నిబంధనలు కూడా ప్రాధాన్యం సంతరించుకుంటాయి. పోలీసుల అనుమతులు లేకుండా లేదా అనుమతులు రద్దయిన ప్రదేశాల్లో నిరసనలు చేపట్టడం వల్ల తలెత్తే పరిణామాలు ఏమిటన్న అంశాన్ని ఈ విచారణ ముందుకు తెచ్చింది. అయితే, అనుమతి సమస్య ఉందన్న కారణంతోనే ప్రతి నిరసనను హింసాత్మకంగా చూడలేము; అలాగే నిరసన హక్కు ఉందన్న కారణంతో అన్ని నియమాలను విస్మరించలేము. చట్టబద్ధమైన నిరసనకు అవకాశం కల్పించడం, శాంతిభద్రతలను కాపాడటం, పౌరుల హక్కులను పరిరక్షించడం—ఈ మూడింటి మధ్య సమతుల్యత సాధించాల్సిన బాధ్యత పాలనా వ్యవస్థలో పాటు సంబంధిత సంస్థలపైనా ఉంటుంది. మొత్తంగా, సీ జె పీ నేతల పిటిషన్ విచారణలో దిల్లీ హైకోర్టు చేసిన వ్యాఖ్యలు నిరసనల నిర్వహణలో అనుమతులు, బారికేడ్ల ప్రాధాన్యం, ప్రత్యామ్నాయ న్యాయ మార్గాల వినియోగంపై దృష్టి సారించాయి.

అయితే, పిటిషన్ ఉపసంహరణను కేసులోని అరోపణలపై తుది తీర్పుగా పరిగణించలేం.